సాక్షి
రంగారెడ్డి
బుధవారం। 18। సెప్టెంబర్। 2024


బాలాపూర్ గణేశుడిపై పూలు చల్లుతున్న మాజీమంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ అనితారెడ్డి తదితరులు


బాలాపూర్ గణనాథుడు

న్యూస్‌రీల్

ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు


విశ్వకర్మ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కలెక్టర్ శశాంక తదితరులు

సాక్షి,రంగారెడ్డి జిల్లా: భారతదేశ పారిశ్రామిక రంగ ప్రగతికి తార్కాణం విశ్వకర్మ అని కలెక్టర్ శశాంక కొనియాడారు. కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వృత్తిలో ప్రతి దానికి రూపకల్పన చేసి ఒక ఆకృతి కల్పించే వారే విశ్వకర్మలని అభివర్ణించారు. ఒక రాతిని చెక్కి దేవుని రూపం కల్పించే విశ్వకర్మలు తమ వృత్తి నైపుణ్యాన్ని చూపుతారని, అలాంటి శిల్పులకు సమాజంలో మంచి ఆదరణ కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాలు చేయూతనిస్తాయని తెలిపారు. అర్హులైన అన్ని కుల వృత్తులు, చేతి వృత్తుల వారు పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీసీ ఫ్రంట్ చైర్మన్ మల్లేష్ యాదవ్, విశ్వకర్మ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటాచారి, నాయకులు కృష్ణ చిత్తరంజన్, కొండయ్య, ఎం.అజయ్, వెంకటేశ్ సుధాకర్, బీసీ సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.


బాలాపూర్ గణేశుడి శోభాయాత్ర

బాలాపూర్ గణేశుడికి బందో'మస్తు'

మహేశ్వరం: బాలాపూర్ గణనాథుడి లడ్డూ వేలం పాట, నిమజ్జన శోభాయాత్రను జయప్రదం చేయడంలో రాచకొండ పోలీసులు సఫలీకృతులయ్యారు. రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు పర్యవేక్షణలో మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి అదనపు ఎస్పీలు, ఏసీపీతో కలిసి భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. లడ్డూ వేలం పాట ముగిసిన వెంటనే గణనాథుడిని క్రేన్‌తో టస్కర్ వాహనంపై ఎక్కించడం.. ఆపై పాతబస్తీ ప్రభావం కలిగిన రాయల్ కాలనీ.. గుర్రం చెరువుకట్ట మీదుగా వెళ్లి హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పోలీసుల పర్యవేక్షణలోకి వచ్చేంత వరకు పకడ్బందీగా వ్యవహరించారు. మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంత రెడ్డి, బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ భూపతి దగ్గరుండి పర్యవేక్షించారు.


పోలీస్ బందోబస్తు మధ్య బాలాపూర్ గణనాథుడి శోభాయాత్ర


ఖైరతాబాద్ మహాగణపతి

నీరా'జనం'

గంగ ఒడికి చేరిన గౌరీ తనయుడు

- అంగరంగవైభవంగా గణనాథుడి శోభాయాత్రలు
- దారి పొడవునా నినాదాలతో హోరెత్తించిన భక్తులు
- మహిళల కోలాటం.. బ్యాండుల మోత.. డీజేల హోరు.. యువత తీన్మార్ స్టెప్పులు
- పోటాపోటీగా లడ్డూల వేలం పాటలు
- బాలాపూర్‌లో రికార్డుస్థాయిలో రూ.30.01 లక్షలు
- జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన నిమజ్జనం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: 'జై బోలో గణేశ్ మహరాజ్‌కీ జై.. గణపబతి బొప్పా మోరియా.. జైజై గణేశా.. బైబై గణేశా' అంటూ గౌరీతనయుడికి జిల్లావాసులు ఘనంగా వీడ్కోలు పలికారు. తొమ్మిది రోజుల పాటు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజించిన గణనాథులకు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించి మేళతాళాలు, డీజే హోరు, యువత తీన్మార్ స్టెప్పుల మధ్య ఊరేగింపుగా తీసుకెళ్లి సమీపంలోని చెరువుల్లో నిమజ్జనం చేశారు. చివరి రోజు ఆయా మండపాల వద్ద పోటాపోటీగా లడ్డూల వేలం పాటలు కొనసాగాయి. సరూర్‌నగర్, తుర్కయంజాల్, మీర్‌పేట్, జల్‌పల్లి, తట్టిఖానా, పులందర్ చెక్‌డ్యాం సహా జిల్లా వ్యాప్తంగా 44 చెరువులు, కుంటలను నిమజ్జనం కోసం ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉదయం ఐదు గంటల నుంచే..

బాలాపూర్ గణనాథుడికి ఉత్సవ కమిటీ సభ్యులు ఉదయం ఐదు గంటలకే ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత వాహనంపై విగ్రహాన్ని ఉంచి గ్రామంలో ఊరేగించారు. దారి పొడవునా మహిళలు, భక్తులు హారతులు పట్టారు. కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం 9.30 గంటలకు ఊరేగింపు బొడ్రాయి వద్దకు చేరుకుంది. ఎమ్మెల్యే సబితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, మేయర్ చిగిరింత పారిజాత, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి సహా పలువురు ప్రముఖులు వేదిక వద్దకు చేరుకుని భక్తులను ఉద్దేశించి మాట్లాడారు.

30వ వేలం పాట.. రూ.30.01 లక్షలు

ఉదయం 10.35 గంటలకు ఉత్సవ కమిటీ సభ్యుడు వంగేటి లక్ష్మారెడ్డి వేలం పాటను ప్రారంభించారు. లింగాల దశరథగౌడ్, లక్ష్మీనారాయణ, కొలన్ శంకర్‌రెడ్డి, సామ ప్రణీత్‌రెడ్డి లడ్డూ వేలం పాటలో పాల్గొన్నారు. తొలుత ఉత్సవ కమిటీ తరఫున రూ.1,116తో వేలం పాట మొదలై పోటాపోటీగా కొనసాగింది. చివరికి కొలన్ శంకర్‌రెడ్డి రూ.30.01 లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు. 1994లో రూ.450తో మొదలైన లడ్డూ వేలం 30 ఏళ్ల పూర్తి చేసుకుని రూ.30.01 లక్షలకు చేరుకుంది. కేవలం పది నిమిషాల్లో వేలం పాట ముగియడం విశేషం. ఇదిలా ఉంటే ఒకే (కొలన్) కుటుంబానికి చెందిన వారు లడ్డూను సొంతం చేసుకోవడం ఇది తొమ్మిదోసారి కావడం గమనార్హం. లడ్డూను దక్కించుకున్న శంకర్‌రెడ్డిని గుర్రపుబండిపై ఎక్కించుకుని మేళతాళాలతో ఊరేగించి, హనుమాన్ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. లడ్డూను ప్రధాని మోదీకి అంకితం ఇవ్వనున్నట్లు శంకర్‌రెడ్డి ప్రకటించారు. త్వరలోనే ఢిల్లీకి చేరుకుని మోదీకి అందజేయనున్నట్లు తెలిపారు. బాలాపూర్ వాసులకు, పేదలకు సైతం పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.

బాలాపూర్ టు హుస్సేన్‌సాగర్

ప్రత్యేక పూజలు, వేలం పాట ముగిసిన తర్వాత ఉదయం 11 గంటలకు శోభాయాత్ర మొదలైంది. అశేషభక్తజనం వెంటరాగా.. గణనాథుడి వాహనం ముందుకు కదిలింది. మల్లాపూర్, చంపాపేట్, పాతబస్తీ సహా ఇతర ప్రాంతాల్లోని గణనాథులు అనుసరించారు. శోభాయాత్ర మధ్యాహ్నం 12.59 గంటలకు బార్కాస్, 1.47 గంటలకు లాల్‌దర్వాజా చౌరస్తా, 2.15 గంటలకు చార్మినార్ దాటింది. అఫ్జల్‌గంజ్, మొజంజాహి మార్కెట్, అబిడ్స్, హిమాయత్‌నగర్ మీదుగా హుస్సేన్‌సాగర్ చేరుకుంది. భక్తులు దారి పొడవునా నినాదాలతో హోరెత్తించారు. పాతబస్తీలోని పలువురు ముస్లింలు, స్వచ్ఛంద సంస్థలు భక్తులకు వాటర్ ప్యాకెట్లు, మజ్జిగ, పులిహోర ప్యాకెట్లు పంపిణీ చేశారు. పలు ప్రధాన కూడళ్లలో భాగ్యనగర్ ఉత్సవ కమిటీ వేదికలు ఏర్పాటు చేసి భక్తులకు స్వాగతం పలికింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ సహా పలువురు ప్రముఖులు భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. బాలాపూర్ గణేశుడి శోభాయాత్ర ప్రశాంతంగా ముగియడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

రికార్డు స్థాయిలో 'రిచ్' లడ్డూ..

బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్‌లోని సన్‌సిటీ రిచ్‌మండ్ విల్లాలోని గణనాథుడి లడ్డూకు రికార్డు స్థాయిలో ధర పలికింది. గత ఏడాది ఆర్‌వి దియా చారిటెబుల్ ట్రస్ట్ రూ.1.27 కోట్లకు దక్కించుకోగా, ఈసారి ఏకంగా రూ.1.87 కోట్లకు దక్కించుకుంది. బాలాపూర్ లడ్డూ వేలం రికార్డును రిచ్‌మండ్ విల్లా గణేశుడి లడ్డూ మరోసారి బ్రేక్ చేయడం విశేషం.

మహాగణపతి శోభాయాత్ర ఇలా..

- సోమవారం రాత్రి 9 గంటలకు మహాహారతి
- 9.45 గంటలకు కలశపూజ
- మంగళవారం తెల్లవారుజామున 4 గంటలకు భారీ క్రేన్ సాయంతో మహాగణపతిని ట్రయిలర్ వాహనంపై ఉంచి వెల్డింగ్ పనులు ప్రారంభం
- 6.32కు మహాగణపతి శోభాయాత్ర ప్రారంభం
- 8.03 గంటలకు సెన్సేషన్ థియేటర్
- 8.38కు రాజ్‌దూత్ చౌరస్తా
- 9.10 గంటలకు హోం సైన్స్ కళాశాల
- 9.40 గంటలకు ఎక్బాల్ మినార్ చౌరస్తా, అక్కడ వినాయకుడు గంటసేపు నిలిపివేత
- 10.59కు పాత సచివాలయం గేటు
- 11.22 తెలుగుతల్లి చౌరస్తా
- 11.30కు సచివాలయం నుంచి ఎన్టీఆర్ మార్గ్‌లో సీఎం రేవంత్ రెడ్డి అధికారులతో కలిసి నిమజ్జనోత్సవాన్ని పరిశీలించారు
- 11.46కు ఎన్టీఆర్ మార్గ్‌లోకి మహాగణపతి
- 12.12కు మహాగణపతి కుడి వైపున ఏర్పాటు చేసిన శివపార్వతుల కల్యాణ నిమజ్జనం
- 12.20 ఎడమవైపు శ్రీనివాస కల్యాణం నిమజ్జనం
- 12.28కు క్రేన్ నెం 4 వద్దకు చేరిక
- 12.40కి సూపర్ క్రేన్ కొక్కాల ఏర్పాటు
- 12.45కు చివరి పూజలు, వెల్డింగ్ తొలగింపు
- 1.20కు క్రేన్ కొక్కాలతో సాగర్ నీటి దిశగా
- 1.32కు సాగర తీరంలో నిమజ్జనానికి క్రేన్ సాయంతో పైకి లేపడం
- 1.37కు సాగర్‌లో నీటిని తాకడం
- 1.38 గంటలకు నీటిలోకి ఒరుగుతూ 1.40కు సంపూర్ణ నిమజ్జనం

లడ్డూ @లక్షలు

- పోటాపోటీగా వేలం పాటలు
- రూ.లక్షల్లో పలికిన లడ్డూలు


చేవెళ్ల: రూ.16.03లక్షలకు లడ్డూ దక్కించుకున్న దేవర వెంకట్‌రెడ్డి సమత దంపతులు

- చేవెళ్ల: చేవెళ్లలో ఏర్పాటు చేసిన రచ్చబండ వినాయకుని లడ్డూను రూ.16.03 లక్షలకు చేవెళ్లకు చెందిన పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, సమత దంపతులు దక్కించుకున్నారు. పలుగుట్టలో రూ.3.05 లక్షలకు శ్రీనివాస్ ట్రేడర్స్ రాంరెడ్డి బ్రదర్స్, రామన్నగూడలో రూ.2.20 లక్షలకు పెద్దళ్ల మోహన్ బృందం, ముడిమ్యాలలో రూ.1.35 లక్షలకు ఎస్.శ్రీకాంత్, ఆలూరు అంబేడ్కర్ సంఘం లడ్డూను ఫ్రెండ్స్ హెల్పింగ్ గ్రూప్ సభ్యులు రూ.1.20 లక్షలకు, ధర్మసాగర్‌లో రూ.3.01 లక్షలకు గుర్రాల రాంరెడ్డి, చనువెల్లిలో రూ.2.10 లక్షలకు శ్రీరామ సేన సభ్యులు, కేసారంలో రూ.2.11 లక్షలకు కాసుల మహేందర్‌గౌడ్, దేవునిఎర్రవల్లిలో రూ.2.51 లక్షలకు కె.సత్యనారాయణ లడ్డూలను సొంతం చేసుకున్నారు.ఖానాపూర్‌లో రూ.6.63 లక్షలకు కొత్తకాపు బ్రదర్స్ కైవసం చేసుకున్నారు. గుండాలలో సాయికిరణ్‌రెడ్డి రూ.6.11 లక్షలకు, మరో లడ్డూను రూ.3.51 లక్షలకు గూడెపు శ్రీనివాస్‌రెడ్డి దక్కించుకున్నారు. చేవెళ్లలోని జర్నలిస్ట్ కాలనీలో రూ.3.71లక్షలకు ఎస్‌పీ గ్రూప్ సభ్యులు సొంతం చేసుకున్నారు. రావులపల్లి గ్రామంలో పెద్ద లడ్డూను పి.ప్రకాశ్‌రెడ్డి రూ.2.05 లక్షలకు దక్కించుకున్నారు. ఇబ్రహీంపల్లిలో పెద్ద లడ్డూను రూ.1.76 లక్షలకు మల్లయ్య, రెండో లడ్డూను రూ.1.17లక్షలకు ఎన్ను లక్ష్మారెడ్డి కైవసం చేసుకున్నారు. పామెనలో రూ.1.30లక్షలకు టి.వినయ్‌కుమార్, గౌతమ్ సొంతం చేసుకున్నారు. చేవెళ్లలోని సీపీఐ కాలనీలో రూ.1.20 లక్షలకు నర్సింలు అండ్ బ్రదర్స్ కైవసం చేసుకున్నారు. మల్కాపూర్‌లో రూ.1.14 లక్షలకు బి.యాదిరెడ్డి దక్కించుకున్నారు. కందవాడలో హనుమాన్ టెంపుల్ వినాయకుని వద్ద లడ్డూను రూ.1.07 లక్షలకు న్యాయవాది కృష్ణాగౌడ్ కైవసం చేసుకున్నారు. ఆలూరు హనుమాన్ ఆలయం వద్ద లడ్డూను రూ.5లక్షలకు పి. జగన్ కైవసం చేసుకున్నారు.

బడంగ్‌పేట్: బడంగ్‌పేట్‌లోని వీరాంజనేయ భక్త సమాజం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణనాథుని లడ్డూ రూ.11.90 లక్షలు ధర పలికింది. బడంగ్‌పేటకు చెందిన రైతు గౌర సత్తయ్య అతని కుమారులు వీరయ్య, చంద్రయ్య, సురేష్ కలిసి వేలం పాటలో లడ్డూను కైవసం చేసుకున్నారు.


బడంగ్‌పేట్: రూ.11.90 లక్షలకు లడ్డూ సొంతం చేసుకున్న గౌర సత్తయ్య కుమారులు

- మొయినాబాద్‌రూరల్: ఎన్కేపల్లిలో పంచాయతీ ఏర్పాటు చేసిన లడ్డూను గ్రామానికి చెందిన సుభాష్ రూ.7.71 లక్షలకు కైవసం చేసుకున్నారు.
- షాబాద్: మల్లారెడ్డిగూడ లడ్డూను రూ.2.66 లక్షలకు అవీర్‌పేట్ గోవర్ధన్‌రెడ్డి సొంతం చేసుకున్నారు. హైతాబాద్ పంచాయతీ మొదటి వినాయకుడి లడ్డూను అదే గ్రామానికి చెందిన అత్తేలి శ్రీనివాస్‌రెడ్డి రూ.2.11 లక్షలకు, రెండో వినాయకుడి లడ్డూను అదే గ్రామానికి చెందిన అవుల భాస్కర్ రూ.1.10 లక్షలకు సొంతం చేసుకున్నారు.
- శంకర్‌పల్లి: పట్టణంలోని వరసిద్ధి వినాయక ఉత్సవ సమితి ఏర్పాటు చేసిన గణపతి లడ్డూను రూ. 2.62 లక్షలకు మోకిలకి చెందిన ఆర్ గ్రూప్ సభ్యులు దక్కించుకున్నారు.
- కందుకూరు: ముచ్చర్లలో లడ్డూను రూ.1.46 లక్షలకు ఊటు మహేందర్ కైవసం చేసుకున్నారు.
- అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం పరిధిలోని 9వ వార్డు సూర్యవంశీ గార్డెన్ సిటీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథుడి పెద్ద లడ్డూను జొన్నలగడ్డ వినిత రాజశేఖర్‌రెడ్డి రూ. 3.02 లక్షలకు, చిన్న లడ్డూను సోడిశెట్టి నాగమల్లీశ్వరీ శివనాగేశ్వరరావు దక్కించుకున్నారు.
- మొయినాబాద్: విజయనగర్ కాలనీలో ప్రతిష్ఠించిన వినాయకుడి చేతిలోని పెద్ద లడ్డూను రూ.3.05 లక్షలకు మండడి కృష్ణారెడ్డి, చిన్న లడ్డూను రూ.1.75 లక్షలకు పాటి కృష్ణారెడ్డి సొంతం చేసుకున్నారు.


మొయినాబాద్‌రూరల్: రూ.7.71 లక్షలకు ఎన్కేపల్లి లడ్డూను కైవసం చేసుకున్న సుభాష్

అమరులదే ఈ ఘనత

- వారి త్యాగాల ఫలితమే నేటి స్వాతంత్య్రం
- సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో కీలకం
- ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం
- సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి
- ఘనంగా ప్రజాపాలన వేడుకలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: నాటి మహనీయుల త్యాగ ఫలితమే నేటి స్వేచ్ఛ, స్వాతంత్ర్యం అని సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి అన్నారు. సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో కీలకమైందని పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాపాలన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భూమి, భుక్తి, వెట్టి విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో జిల్లా ప్రజల పాత్ర మరువలేనిదన్నారు. తెలంగాణ తొలిదశ, మలిదశ ఉద్యమాల్లోనూ అనేక మంది అసువులు బాశారని గుర్తు చేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఘనత అమరులదేనన్నారు.

సంక్షేమానికి పెద్దపీట

సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని వేం నరేందర్ రెడ్డి తెలిపారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా జిల్లాలో ఇప్పటివరకు 14.82 కోట్ల మంది మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించినట్లు చెప్పారు. ఆరోగ్యశ్రీ కింద 11 వేల మందికి ఉచిత చికిత్సలు చేయడం జరిగిందన్నారు. 1.97 లక్షల కుటుంబాలకు రూ.500కే గ్యాస్ సిలిండర్ అందజేస్తున్నట్లు తెలిపారు. 3.40 లక్షల కుటుంబాలకు గృహజ్యోతి పథకం కింద ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెప్పారు. రూ.రెండు లక్షల రుణమాఫీ పథకంలో భాగంగా జిల్లాలో ఇప్పటి వరకు 87,586 మంది రైతులకు రూ.660.72 కోట్లు మాఫీ చేసినట్లు వివరించారు.


జాతీయజెండాను ఆవిష్కరించి వందనం చేస్తున్న సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, కలెక్టర్ శశాంక, ఎమ్మెల్యేలు తదితరులు

గౌరవవందనం స్వీకరించి..

అంతకు ముందు వేం నరేందర్ రెడ్డి పోలీసులచే గౌరవ వందనం స్వీకరించి, జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకర్, ప్రకాష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తాగుతున్న వ్యక్తి అరెస్ట్

కడ్తాల్: గంజాయి తాగుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసిన సంఘటన మండల పరిధిలోని ముద్వీన్‌లో చోటు చేసుకుంది. సీఐ శివప్రసాద్ మంగళవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన మహమ్మద్ అబ్బాస్ అనే యువకుడు పెయింటర్‌గా పనిచేస్తూ, అప్పుడప్పుడు హైదరాబాద్ నగరంలోని దూల్‌పేట్ ప్రాంతంలో గంజాయిని కొనుగోలు చేసి, తన మిత్రుడైన ఆమనగల్లుకు చెందిన పవన్‌తో కలిసి తాగేవారు. అంతేకాకుండా ఇతరులకు కూడా ఇచ్చేవారు. ఇదిలా ఉండగా ఈనెల 16న స్థానిక పాఠశాల సమీపంలో అబ్బాస్ గంజాయి తాగుతున్నాడని సమాచారం అందుకున్న ఎస్ఐ వరప్రసాద్ సిబ్బందితో కలిసి ముద్వీన్‌కు చేరుకుని అతన్ని అదుపులోకి తీసుకున్నారు. ఇతని వద్ద లభించిన 27 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని, పీఎస్‌కు తరలించారు. మరో యువకుడు పవన్ పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్ఐ వరప్రసాద్, కానిస్టేబుళ్లు, రామ్‌కోటి, రాజశేఖర్, శ్యాంసన్‌ను సీఐ అభినందించారు.

అనుమానాస్పద స్థితిలో కార్మికుడి మృతి



రావిదాసు మృతదేహం

కొందుర్గు: అనుమానాస్పదస్థితిలో ఓ కార్మికుడు మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని చిన్నఎల్కిచర్ల శివారులోని మహరా పుష్య ఆగ్రో ప్రోడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రం నవద జిల్లా అజలాల్ బీఘ గ్రామానికి చెందిన రావిదాసు (38), రాజ్‌వన్షీ ఈ ఏడాది జూలై 25 నుంచి పరిశ్రమలో కార్మికులుగా పనిచేస్తున్నారు. పరిశ్రమ ఆవరణలోనే జీవనం సాగిస్తున్నారు. ఇద్దరూ సరుకుల కోసం సోమవారం సాయంత్రం కొందుర్గు వెళ్లారు. అక్కడ సరకులు తీసుకొని ఇద్దరూ కలిసి మద్యం తాగి రాత్రికి పరిశ్రమకు వచ్చి పడుకున్నారు. మంగళవారం ఉదయం లేచిచూసేసరికి రావిదాసు మృతిచెందాడు. ఈ విషయమై పరిశ్రమ యాజమాన్యంతోపాటు, మృతుడి కుటుంబ సభ్యులకు ఫోను ద్వారా సమాచారం అందించారు. రాజ్‌వన్షీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ వైస్ చైర్మన్‌కు సన్మానం



శ్రీకాంత్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

కడ్తాల్: తెలంగాణ బాల్ బ్యాండ్మింటన్ అసోసియేషన్ వైస్ చైర్మన్‌గా కాంగ్రెస్ కల్వకుర్తి పట్టణ అధ్యక్షుడు చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ ఆధ్వర్యంలో పలువురు నాయకులు ఆయనను కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు పర్వత్‌రెడ్డి, జిల్లా నాయకులు మిరియాల శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ కడ్తాల్, వెల్దండ మండలాల అధ్యక్షులు బీచ్యానాయక్, మోతీలాల్‌నాయక్, సింగిల్ విండో డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, మాజీ ఎంపీటీసీ వెంకట్ రెడ్డి, జిల్లా సేవాదళ్ ఉపాధ్యక్షులు సత్తూరి ప్రసాద్‌గౌడ్, పుల్లయ్య తదితరులు ఉన్నారు.

అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయి

సనత్‌నగర్: అన్ని శాఖల సమన్వయంతో వినాయక నిమజ్జన ఘట్టం ప్రశాంతంగా జరుగుతుందని హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో నగరంలో జరుగుతున్న శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమాలపై ఉన్నతాధికారులతో కలిసి ఏరియల్ వ్యూ నిర్వహించారు. అనంతరం బేగంపేట ఎయిర్‌పోర్ట్‌లో ఆయన మాట్లాడుతూ నిమజ్జనానికి ముందు పలుమార్లు అధికారులతో సమీక్షలు నిర్వహించి తగిన సూచనలు జారీ చేయడం జరిగిందన్నారు. ఆ మేరకు మండప నిర్వాహకులకు కూడా అధికారులు దిశా నిర్దేశం చేశారన్నారు. చార్మినార్, బాలాపూర్, గచ్చిబౌలి ప్రాంతాల్లో ఏరియల్ వ్యూ నిర్వహించామని పురానాపూల్, అఫ్జల్‌గంజ్ ఏరియాలో నిమజ్జనం కోసం విగ్రహాలు బారులు తీరాయన్నారు. కార్యక్రమంలో డీజీపీ జితేందర్, నగర సీపీ సీవీ ఆనంద్, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి పాల్గొన్నారు.



మాల్‌లో ఆక్రమణకు గురవుతున్న సర్వే నంబర్ 640లోని ప్రభుత్వ భూమి



బండరాళ్ల బ్లాస్టింగ్

క్యాహై కమాల్!

మాల్‌లో కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూమి

- 16.37 ఎకరాలకు గాను పది ఎకరాలు కూడా లేని వైనం
- రూ.70 కోట్ల విలువ చేసే స్థలానికి కరువైన రక్షణ
- కంటితుడుపు చర్యలతో సరిపెడుతున్న అధికారులు

యాచారం: మాల్‌లో కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతోంది. రంగారెడ్డి- నల్గొండ జిల్లాల సరిహద్దులో ఉన్న ఈ గ్రామం వ్యాపార కేంద్రంగానూ ప్రసిద్ధి గాంచింది. దీంతో ఇక్కడి వ్యవసాయ భూములు, ప్లాట్లకు మంచి డిమాండ్ ఉంది. అయితే నాగార్జునసాగర్- హైదరాబాద్ రూట్‌లోని సుమారు రూ.70 కోట్లకు పైగా విలువ చేసే ప్రభుత్వ భూమికి రక్షణ లేకుండా పోయింది. ఈ రహదారి పక్కనే 640 సర్వే నంబరులో 16.37 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. దీని చుట్టూ పట్టా భూములు, మాల్ వ్యాపార కేంద్రం విస్తరించి ఉంది. అత్యంత విలువైన ఈ స్థలాన్ని కాపాడటంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ విషయమై అనేకసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ఇది దేనికి సంకేతమని ప్రశ్నిస్తున్నారు. కొంతమంది రాజకీయ నాయకుల అండదండలతో రియల్ వ్యాపారులు ప్రభుత్వ స్థలాల కబ్జాకు పాల్పడుతున్నారని పేర్కొంటున్నారు. మాల్‌లో ఎకరా వ్యవసాయ భూమి ధర రూ.4 కోట్లకు పైగా పలుకుతోంది. అదే ప్లాట్లలో గజానికి రూ.15 వేల నుంచి రూ.20 వేలకు పైగానే డిమాండ్ ఉంది.

కంచె లేకపోవడంతోనే ..

మాల్‌లోని ప్రభుత్వ భూమికి కంచె, హద్దురాళ్లు లేకపోవడంతో ఆక్రమణదారులు సులువుగా తమ పని కానిచ్చేస్తున్నారు. నగరానికి చెందిన కొందరు రియల్ వ్యాపారులు ఈ స్థలం పక్కనే వెంచర్ చేస్తున్నారు. వెంచర్ చదును చేస్తున్న క్రమంలో బయటపడుతున్న పెద్దపెద్ద బండరాళ్లను సర్కారు స్థలంలో తెచ్చి పడేస్తున్నారు. దీనికి తోడు ఆక్రమణకు సైతం పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. అధికారులకు ఫిర్యాదులు వెళ్లిన ప్రతీసారి తూతూ మంత్రంగా సర్వే చేయడం, హద్దురాళ్లు పాతడం వంటివి చేస్తున్నారు. ఆతర్వాత కబ్జాకోరులు వీటిని తీసేయడం పరిపాటిగా మారింది. ఇలా 16.37 ఎకరాల ప్రభుత్వ భూమికి గానూ ప్రస్తుతం 10 ఎకరాలు కూడా సరిగ్గా లేదని తెలుస్తోంది.

సంతకు స్థలం కేటాయించాలని ..

మాల్‌లో ప్రతీ మంగళవారం పశువుల సంత జరుగుతుంది. రంగారెడ్డి జిల్లాతో పాటు నల్గొండ, నాగర్‌కర్నూల్ జిల్లాలకు చెందిన రైతులు, వ్యాపారులు ఇక్కడకు వచ్చి క్రయవిక్రయాలు నిర్వహిస్తారు. పాడి, పశువులు, ఆవులతో పాటు కాడెడ్లు, గొర్రెలు, మేకలు సరసమైన ధరలకు లభిస్తాయి. సంత నిర్వహణతో మాల్ పంచాయతీకి ఏటా రూ.70 లక్షలకు పైగానే ఆదాయం సమకూరుతోంది. కానీ సంత నిర్వహణకు శాశ్వత స్థలం లేదు. దీంతో స్థానికంగా అందుబాటులో ఉన్న భూములు, వెంచర్లలో కొనసాగుతోంది. ప్రస్తుతం కొనసాగుతున్న సంత స్థలం 640 సర్వేనంబర్‌లోని ప్రభుత్వ భూమిలో ఉంది. 640లోని ప్రభుత్వ భూమిలో పశువుల సంత, మటన్, చికెన్ మార్కెట్లకు 5 ఎకరాల స్థలం కేటాయించాలని గత 25 ఏళ్లుగా స్థానికులు, ప్రజా ప్రతినిధుల విన్నవిస్తున్నారు. కానీ ఆచరణకు నోచుకోవడం లేదు.

చుట్టూ కబ్జా



విలువైన ప్రభుత్వ భూమికి రక్షణ లేకుండా పోయింది. సర్వే నంబరు 640లోని స్థలాన్ని ఓ రియల్ వ్యాపారి యథేచ్ఛగా అక్రమిస్తున్నాడు. వెంచర్ ఏర్పాటులో బండ రాళ్లను ప్రభుత్వ భూమిలో పడేస్తున్నాడు. రెవెన్యూ అధికారులు సర్వే చేసి 16.21 ఎకరాల చుట్టూ రాతి గోడ నిర్మించాలి.

– బట్టు శ్రీనివాస్, మాల్ గ్రామస్తుడు

స్థలం కేటాయించాలి



మాల్ సంతకు స్థలం కేటాయించాలనే డిమాండ్ అనేక ఏళ్లుగా ఉంది. కానీ ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిని గుర్తించి కేసులు నమోదు చేయించాలి. ప్రస్తుత ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని సంతకు స్థల సమస్యను నెరవేర్చాలి.

– పదకంటి కవిత శేఖర్‌గౌడ్, మాజీ సర్పంచ్, మాల్

ఆక్రమిస్తే కేసులు



ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారు ఎవరైనా చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తాం. అవసరమైతే హైడ్రా తరహాలో సర్వే చేసి ఆక్రమణలను స్వాధీనం చేసుకుంటాం. అక్రమ నిర్మాణాలను కూల్చేస్తాం. ప్రభుత్వ భూమి చుట్టూ కంచె ఏర్పాటు కోసం నివేదిక పంపిస్తాం.

– అయ్యప్ప, తహసీల్దార్, యాచారం

అక్రమంగా విక్రయిస్తున్న మద్యం స్వాధీనం

శంకర్‌పల్లి: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని రాజేంద్రనగర్ ఎస్‌వోటీ, శంకర్‌పల్లి పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. మండలంలోని పర్వేద గ్రామంలో కిరాణా దుకాణం నిర్వహిస్తున్న మహేందర్ (35), వెంకట్‌రెడ్డి (70) ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్నారు. పక్కా సమాచారం అందుకున్న ఎస్‌వోటీ, స్థానిక పోలీసులు దాడి చేసి రూ.5వేల విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం పట్టివేత.. కేసు నమోదు

కొందుర్గు: అక్రమంగా విక్రయిస్తున్న మద్యం పట్టుకున్నట్లు జిల్లేడ్ చౌదరిగూడ ఎస్ఐ విజయ్ తెలిపారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలం తుమ్మలపల్లికి చెందిన సంతోష్ తన దుకాణంలో అనుమతి లేకుండా అక్రమంగా మద్యం విక్రయిస్తున్న విషయం తెలుసుకున్న పోలీసులు మంగళవారం సోదా చేశారు. తనిఖీల్లో రూ. 9,504 విలువైన 48 ఐబీ క్వార్టర్ బాటిళ్లు, 24 బీరు బాటిళ్లు లభ్యమయ్యాయి. మద్యం బాటిళ్లను సీజ్‌చేసి సంతోష్‌పై కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వాచ్‌మెన్ మృతి

మొయినాబాద్: అతివేగంతో వచ్చిన బైక్ మోపెడ్‌ను ఢీకొట్టడంతో ఓ వాచ్‌మెన్ మృతి చెందాడు. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా జిల్లా కుర్కుంటకు చెందిన దస్తగిరి (50) మండల పరిధిలోని ముర్తూజాగూడ సమీపంలో ఉన్న ఓ ఫాంహౌస్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం సాయంత్రం దస్తగిరి, అతని స్నేహితుడు జఫ్రర్ కలిసి మోపెడ్‌పై ముర్తూజగూడ గ్రామానికి వెళ్లారు. తిరిగి ఫాంహౌస్‌కు వస్తుండగా ఓ బైక్ అతివేగంతో వచ్చి వీరి వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో వాహనంపై ఉన్న ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వెంటనే స్థానిక భాస్కర ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి ఉస్మానియా ఆస్పత్రికి పంపించారు. ఉస్మానియాలో చికిత్స పొందుతూ దస్తగిరి సోమవారం రాత్రి మృతి చెందాడు. జఫ్రర్ చికిత్స పొందుతున్నాడు. మృతుడి భార్య షరీఫా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జియోన్ ఎంబీ చర్చి ప్రతినిధులకు అరుదైన గౌరవం



హ్యాండ్ రిటన్ బైబిల్ కార్యక్రమంలో పాల్గొన్న జియోన్ ఎంబీ ప్రతినిధులు

షాద్‌నగర్ రూరల్: హ్యాండ్ రిటన్ బైబిల్‌కు ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం దక్కింది. ఏపీలోని కర్నూల్ పట్టణ శివారులోని పుల్లారెడ్డి కాలేజ్ (రెమ చర్చి)లో బైబిల్ రీడింగ్ చాలెంజ్ గ్రూపు ఆధ్వర్యంలో మంగళవారం బైబిల్‌ను హ్యాండ్ రిటన్(చేతి)తో రాశారు. ఈ కార్యక్రమానికి దేశం నలుమూలల నుంచి 160 మంది మహిళలు పాల్గొనగా.. పట్టణంలోని జియోన్ ఎంబీ చర్చికి చెందిన ప్రతినిధులు సమంత, జెరుషాప్రెట్టి, సుచిత్ర, ప్రియాంక పాల్గొన్నారు. 160 మంది మహిళలు కేవలం 8గంటలలోనే చేతి రాతతో బైబిల్‌ను రాసి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం సంపాదించారు. ఇది ప్రపంచంలోనే మొదటి సారిగా నమోదైన రికార్డు అని నిర్వాహకులు తెలిపారు. అనంతరం స్థానిక చర్చి కమిటీ సభ్యులు సమంత, జెరుషాప్రెట్టి, సుచిత్ర, ప్రియాంకను అభినందించారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

కాచిగూడ: టస్కర్ కిందపడి తీవ్రంగా గాయపడిన ఓ బాలిక ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి... కాచిగూడ ప్రాంతానికి చెందిన మహేందర్ కుటుంబం గత కొన్నేళ్లుగా ఎల్‌బీ నగర్‌లో నివాసం ఉంటోంది. గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏటా కాచిగూడకు వచ్చేవారు. ఈ సారి కూడా వినాయక విగ్రహం ఏర్పాటు చేసి ఈ నెల 15న రాత్రి హుస్సేన్‌సాగర్‌కు నిమజ్జనానికి తరలించారు. వినాయకుడి తీసుకెళుతున్న వాహనం హిమాయత్‌నగర్ వై జంక్షన్ వద్దకు రాగానే వాహనంపై నున్న మహేందర్ ప్రమాదవశాత్తు జారి కింద పడ్డాడు. దీనిని గమనించిన అతడి కుమార్తె పూజిత (17) తండ్రి పడిపోయాడని వెంటనే టస్కర్ నుంచి కిందకు దూకింది. వాహనం వెనుక టైర్‌కు ఆమె తల తగలడంతో తీవ్రంగా గాయపడింది. వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. పూజిత దిల్‌సుఖ్‌నగర్ లోని ప్రగతి డిగ్రీ కాలేజీలో బీ.కాం మొదటి సంవత్సరం చదువుతోంది. ప్రమాదానికి కారణమైన టస్కర్ డ్రైవర్ రమేష్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కుమారుడి మృతిని తట్టుకోలేక..

కొడుకు భౌతికకాయంపై పడి తండ్రి మృతి



నర్సింగ్‌రావు ముదిరాజ్



లక్ష్మయ్య ముదిరాజ్

వెంగళరావునగర్ : కుమారుడిని మృతిని జీర్ణించుకోలేక అతడి భౌతికకాయంపై పడి విలపిస్తూ తండ్రి మృతి చెందిన సంఘటన జవహర్‌నగర్‌లో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి... వెంగళరావునగర్ డివిజన్ జవహర్‌నగర్‌కు చెందిన గంట నర్సింగరావు ముదిరాజ్ (55) విద్యుత్‌శాఖలో ఉద్యోగిగా పని చేసేవాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నర్సింగరావు సోమవారం రాత్రి మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని అర్ధరాత్రి జవహర్‌నగర్‌లోని ఇంటికి తీసుకువచ్చారు. మంగళవారం ఉదయం ఈ విషయం తెలియడంతో అతడి తండ్రి లక్ష్మయ్య ముదిరాజ్ (80) అక్కడికి వచ్చాడు. కళ్లముందు కుమారుని మృతదేహం చూసి తీవ్ర ఆవేదనకు గురైన ఆయన అక్కడే కుప్పకూలిపోయాడు. కొన్ని క్షణాలపాటు మృతదేహం వద్ద విలపిస్తున్నాడని భావించిన కుటుంబ సభ్యులు అతను ఎంతకూ లేవకపోవడంతో అతడిని కదిలించగా ఆయన కూడా మృతి చెంది ఉండటాన్ని చూసి దిగ్భ్రాంతికి గురయ్యారు. తండ్రి, పెద్ద కుమారుని మృతదేహాల వద్ద కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు విలపిస్తున్న తీరు కంట తడి పెట్టించింది. కాగా లక్ష్మయ్య కూడా విద్యుత్‌శాఖలోని విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేశాడు

జల్సాల కోసం చోరీలు

- బోరు మోటార్లు, సోలార్ ప్లాంట్లలో దొంగతనాలు
- పోలీసులకు పట్టుబడిన ఇద్దరు నిందితులు
- వివరాలు వెల్లడించిన ఆమనగల్లు సీఐ ప్రమోద్‌కుమార్



ఆమనగల్లు పోలీసు స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న సీఐ ప్రమోద్‌కుమార్, ముసుగులో ఉన్నవారు నిందితులు

ఆమనగల్లు: జల్సాలకు అలవాటుపడిన ఇద్దరు యువకులు దొంగతనాలకు పాల్పడుతూ పోలీసులకు పట్టుబడ్డారు. ఆమనగల్లు పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ ప్రమోద్‌కుమార్ వివరాలు వెల్లడించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఇటిక్యాల మండల కేంద్రానికి చెందిన వజ్రగిరి సత్యరాజు అలియాస్ ఎరుకలి రాజు, వజ్రగిరి మధు, కుటుంబ సభ్యులు కలిసి డబ్బు సంపాదించడానికి చిన్న చిన్న చోరీలు ప్రారంభించారు. మొదట వ్యవసాయ బోరు మోటార్లు దొంగిలించి, అందులోని కాపర్‌వైర్‌ను అమ్ముకుని డబ్బులు పంచుకునేవారు. ఈక్రమంలో పెద్ద చోరీలు చేయాలని నిర్ణయించుకున్నారు. సోలార్ కరెంటు తయారయ్యే ప్లాంట్లలో కాపర్‌వైర్ ఎక్కువగా దొరుకుతుందని తెలుసుకున్నారు. ప్లాంట్లు ఎక్కడెక్కడ ఉన్నాయో తెలుసుకునేందుకు రెక్కీ నిర్వహించారు. ఇందులో భాగంగా గత జులై 19న ఆమనగల్లు మండలం మేడిగడ్డ సమీపంలోని సోలార్ ప్లాంట్‌లో దాదాపు రూ.10 వేల విలువైన కాపర్ వైర్‌ను దొంగిలించారు. యాజమాన్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు ప్రారంభించారు. ఈనెల 16న ఆమనగల్లు సమీపంలోని సెల్‌టవర్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఎరుకలి రాజు, మధును అదుపులోకి తీసుకుని విచారించారు. వీరి ముఠాపై ఇప్పటికే మిడ్జిల్ పీఎస్‌లో నాలుగు, కల్వకుర్తి, అడ్డాకుల, చిన్నచింతకుంట, మక్తల్ పీఎస్‌ల పరిధిలో ఒక్కో కేసు చొప్పున నమోదై ఉంది. నిందితులిద్దరినీ అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. కేసును ఛేదించిన ఆమనగల్లు, తలకొండపల్లి ఎస్ఐలు వెంకటేశ్, శ్రీకాంత్, కానిస్టేబుల్‌లు శివకుమార్, రఘు, జాష్వాలను సీఐ అభినందించారు. విలేకరుల సమావేశంలో ఆమనగల్లు ఎస్ఐ వెంకటేశ్ ఉన్నారు.

మొక్కలతోనే మానవ మనుగడ

ఎమ్మెల్సీ వాణీదేవి



మెడిసినల్ రిసార్ట్స్ కేంద్రంలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్సీ వాణీదేవి

మొయినాబాద్‌రూరల్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎమ్మెల్సీ వాణీదేవి అన్నారు. మంగళవారం సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని తోల్‌కట్ట సమీపంలో గల స్వామి రామానందతీర్థ రిసార్ట్స్ సెంటర్ పీవీ మెడికల్ వనంలో వనమహోత్సవ కార్యక్రమాన్ని డైరెక్టర్ శేఖర్ పెద్దఎత్తున నిర్వహించారు. అనంతరం పీవీ మెడిసినల్ రిసార్ట్స్ సెంటర్‌లో ఉన్న మొక్కలను పరిశీలించారు. ఈ కార్యక్రమానికి ము ఖ్య అతిథిగా ఎమ్మెల్సీ వాణిదేవి పాల్గొని అందరితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మొక్కలు నాటడంతో నేటి భావితరాలకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ప్రతి సంవత్సరం పీవీ మెడిసినల్ వనంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించడాన్ని ఆమె అభినందించారు. కార్యక్రమంలో పీవీ మెడిసినల్ రిసార్ట్స్ సెంటర్ డైరెక్టర్ శేఖర్, ఎత్తుమార్‌పల్లి మాజీ ఉపసర్పంచ్ భిక్షపతి, ఆయా గ్రామాల నాయకులు ఉన్నారు.

డాక్టర్ స్రవంతికి గోల్డ్ మెడల్



ప్రశంసాపత్రం అందుకుంటున్న స్రవంతి

మహేశ్వరం: మండలంలోని కల్వకోల్ గ్రామానికి చెందిన డాక్టర్ కొర్ర స్రవంతికి ఎంబీబీఎస్, ఎంఎస్ గైనాకాలజీ విభాగంలో యూనివర్సిటీ టాపర్‌గా నిలిచినందుకు గోల్డ్ మెడల్‌ను అందుకుంది. గాంధీ హాస్పిటల్ ఫౌండేషన్ డే సందర్భంగా మంగళవారం గాంధీ మెడికల్ కాలేజీ ఆవరణలో పీజీలో టాపర్‌గా నిలిచినందుకు డా.శ్రవంతికి గాంధీ మెడికల్ కాలేజీ యాజమాన్యం, ప్రిన్సిపాల్, వైద్యులు గోల్డ్ మెడల్‌లను అందజేసి అభినందించారు. పీజీ గైనకాలజీ విభాగంలో అత్యధిక మార్కులు సాధించినందుకు స్రవంతికి గోల్డ్ మెడల్‌ను అందజేశామని గాంధీ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డా.కే.ఇందిరా, నిమ్స్ మాజీ డైరెక్టర్ డా.డి. రాజారెడ్డిలు తెలిపారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత డా. స్రవంతి మాట్లాడుతూ.... గ్రామీణా, గిరిజన ప్రాంతాల్లో ఉన్న పేదవారికి డాక్టర్‌గా తనవంతుగా సహాయం అందించడం కోసం కృషి చేస్తానని తెలిపారు. తనకు పీజీ గైనకాలజీ విభాగంలో అత్యధిక మార్కులు సాధించినందుకు మెడికల్ కాలేజ్ నుంచి గోల్డ్‌మెడల్ రావడం గర్వంగా ఉందన్నారు. ప్రొఫెసర్లు, కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో కష్టపడి చదివానని ఆమె తెలిపారు. భవిష్యత్‌లో పేదలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో గాంధీ హాస్పిటల్ సుపరింటెండెంట్ డా.సీహెచ్.రాజకుమారి, విజయచంద్రా హాస్పిటల్ ఎండీ. డా.ప్రవీన్ కుమార్ పలువురు పాల్గొన్నారు.

దివ్యాంగులకు చేయూత అందించాలి



దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందజేస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

కంటోన్మెంట్: దివ్యాంగుల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాల్సిన అవసరం ఉందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. బోయిన్‌పల్లిలోని 'నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ ది ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటలెక్చువల్ డిజేబిలిటీస్' -నీ పెడ్ (దివ్యాంగ్జన్)లో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 10 నుంచి 12 లక్షల మంది దివ్యాంగులు ఉండగా, వారిలో 2 లక్షల మందికి నీపెడ్ సేవలు అందించడం అభినందనీయమన్నారు. రాబోయే రోజుల్లో ఈ సేవలు మరింత విస్తృతం చేయాలన్నారు. ఇందుకు అవసరమైన సహకారాన్ని కేంద్ర ప్రభుత్వం ద్వారా అందించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ముగ్గురు దివ్యాంగులకు వేర్వేరు సంస్థల్లో ఉద్యోగాలు కల్పిస్తూ వారికి ఆఫర్ లెటర్‌లను అందజేశారు. మరికొందరు దివ్యాంగుల సామర్థ్యానికి అనుగుణంగా ఉద్యోగాలు కల్పించే అవకాశాలను పరిశీలిస్తామన్నారు. పలువురు విద్యాంగులకు ట్రైసైకిళ్లు అందజేశారు. కార్యక్రమంలో నీపెడ్ డైరెక్టర్ రామ్‌కుమార్, కొల్లి నాగేశ్వర్ రావు, అలిమ్‌కో ప్రతినిధి సంజయ్ సింగ్, స్థానిక బీజేపీ నేత బానుక మల్లికార్జున్ పాల్గొన్నారు.